క్లుప్తంగా

ఈ క్రాప్‌పై గ్రామ సభలు



వెల్దుర్తి: మాచర్ల డివిజన్ పరిధిలో 42,804 హెక్టార్లలో పంటల సాగుపై ఈ క్రాప్, ఈ కేవైసీ పూర్తి చేయటం జరిగిందని ఏడీఏ జగదీశ్వర రెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుంచి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించబడుతుందన్నారు. ఈ క్రాప్‌పై అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలోని రైతుల క్రాప్ నమోదు వివరాలను సమగ్రంగా చదివి వినిపించటం జరుగుతుందన్నారు. రైతు సోదరులు మీ గ్రామాలలోని ఆర్బీకేలలో ప్రదర్శించబడిన జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకెళ్ళి సవరణలు చేయించుకోవాలన్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌కు ఈ క్రాప్ కొరకు ఆఖరి అవకాశమన్నారు. తుది జాబితా తరువాత ఎటువంటి మార్పులు చేయరన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో ఈ క్రాప్ జాబితా ప్రదర్శన



ముటుకూరు (దుర్గి): మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 10,193 హెక్టార్లలో రైతులు పంట సాగు చేపట్టారని మండల వ్యవసాయ అధికారి వై అమీర్‌రెడ్డి అన్నారు. గురువారం ముటుకూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి స్థానిక రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పంట సాగు చేపట్టిన మొత్తం విస్తీర్ణంలో ఈ క్రాప్ నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 29 వరకు సంబంధిత వివరాల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామని వివరించారు. రైతులకు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించాలని, ముసాయిదా తుది జాబితా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంది నాసరయ్య, వీఏఏలు, వీహెచ్‌ఏలు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రెంటచింతల: గురజాల మండలం అంబాపురం గ్రామం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన ఘటన చోటుచేసుకుంది. రెంటచింతలకు చెందిన చదలవాడ శ్రీనివాసరావు మరో వ్యక్తితో కలిసి పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అంబాపురం గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు అయ్యాయి. శ్రీనివాసరావును అతని స్నేహితుడు ఇంటికి తీసుకుపోయాడు. గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఇప్పటికీ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు అతని స్నేహితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



సత్తెనపల్లి: రామాయణ గ్రంథకర్త వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వాల్మీకి బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 28న వాల్మీకి మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని వ్యవసాయం మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావుకు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎస్ఎం ఇస్మాయిల్, హెడ్ గుమస్తా కాంతారావు, వాల్మీకి యువజన సంఘ నాయకులు మల్లా వెంకయ్య, నల్లబోతుల శ్రీను, మల్లా గోపి, మల్లా నాగరాజు, మైలా రామారావు, నల్లబోతుల వెంకటేశ్వరరావు, కన్నెగంటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల విరాళాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో గంగమ్మతల్లి దేవాలయం పునః నిర్మాణ పనులకు సంబంధించి గ్రామానికి చెందిన సూరబత్తిని మల్లేశ్వరరావు–నాగమణి కుటుంబ సభ్యులు 12 సెంట్లు స్థలాన్ని శిల విగ్రహాలను వితరణ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. నూతన దేవాలయం రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టగా పునః నిర్మాణ పనులకు దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పాలన

వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య

గురజాల : బడుగు బలహీన వర్గాల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో సచివాలయం–1 పరిధిలో గురువారం జగనన్న సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య రంగంలో పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రత్యేక స్పెషలిస్టుల ద్వారా ప్రజలకు వైద్య సేవలందించారు. అనంతరం వైద్య కిట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్ మీసాల దానియేలు, ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, గ్రామ సర్పంచ్ బత్తుల ప్రసాద్, మాజీ సర్పంచ్ పోట్ల నారాయణ, పోటు వేణు, మణిదీప్, తండా మస్తాన్, తదితరులున్నారు.

మారుమూల తండాలకూ ఆరోగ్య భరోసా

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మారుమూల ప్రాంతాలలోని గ్రామాలలో నిర్వహించటం సంతోషకరమని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గంగలకుంట సచివాలయ పరిధిలోని హనుమాపురం తండా, గంగలకుంట, రామచంద్రాపురం తండాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. ఐదు దశల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అనారోగ్యానికి గురైన వారిని ఆరోగ్యవంతుల్ని చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిని ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు జల్లెడ పట్టి వారి వివరాలను ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేశారన్నారు. ఏడు రకాల పరీక్షలు ఉచితంగా ఇంటి వద్దనే మందులు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కంపసాటి శివ, మూడావత్ మంత్రునాయక్, రమావత్ లక్ష్మానాయక్ మాజీ సర్పంచ్ బాణావత్ శ్రీనునాయక్, అందుగుల చంద్రయ్య, ఎంపీటీసీ దాసరి వెంకట్రామయ్య, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు మేడబోయిన కోటయ్య, వైద్యాధికారులు కౌసిక్, థెరిస్సా, ముఖర్జీ, కేపీచారి, శ్రీరామ్, నిజాముద్దీన్, ఈఓపీఆర్‌డీ మకట్‌లాల్, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంజినాయక్, వలంటీర్లు, జగనన్న గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం అధికారం చేపట్టిన నాటి నుంచి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పేద ప్రజలకు వైద్య పరంగా భరోసా అందిస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు హెల్త్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురజాల డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, ఎంపీడీవో సరోజినిదేవి, ఈవో కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు, తాళ్ళపల్లి, కొప్పునూరు ఆరోగ్య కేంద్రం వైద్యులు వెస్లీ, ప్రవీణ్, ముక్తియార్ జాని, వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వృద్ధులకు బియ్యం, దుస్తులు పంపిణీ

వెల్దుర్తి: వివేకానంద చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పేద వృద్ధులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేయటం హర్షణీయమని ఎస్ఐ వి.శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఎస్సీ కాలనీలో వృద్ధులకు ఉచితంగా బియ్యం, దుస్తులు పంపిణీ చేశారన్నారు. ఇలాంటి సమాజ సేవ పేదవారికి చేయటం సంతోషకరమన్నారు. కరోనా సమయంలో పోలీసు శాఖ వారికి భోజనం, మంచినీరు అందించిన గోవింద రెడ్డి అభినందనీయుడన్నారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ మా ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎవరూ తోడు లేని వారు ఆశ్రమంలో చేరవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు రాయనూతల సురేష్, యెల్లోరమ్మ, ఆదిరాల యోహాను, మాజీ ఎంపీటీసీ దాసరి సుందరరావు, మాణిక్యం, పిచ్చయ్య, యువకులు, వృద్ధులు పాల్గొన్నారు.



వెల్దుర్తి ఎస్సీ కాలనీలో వృద్ధులతో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి

గ్రామాలలో ఘర్షణలకు పాల్పడవద్దు

ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా అన్నదమ్ముల వలే కలసి మెలసి జీవించాలని ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా మండలంలోని తుమ్మకోట గ్రామంలో తలపెట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఎస్ఐ గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వరకే గ్రామాలలో ప్రతి ఒక్కరూ రాజకీయాలకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితంలో అనేక అనర్థాలకు దారి తీస్తాయని, కుటుంబానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సమయంలో పాత కక్షలు మనస్సులో పెట్టుకుని ఘర్షణలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని దీంతో కుటుంబంపై ఆ ప్రభావం ఉంటుందన్నారు. సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే చట్ట పరిధిలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎవరు చట్టాన్ని తమ చేతులలోకి తీసుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తుమ్మకోట గ్రామంలో పల్లెనిద్ర సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

నకరికల్లు: వరిపైరు సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోవడం ఆకుచుట్టు పురుగుగా గుర్తించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. నకరికల్లులోని వరిపొలాలను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో దుబ్బుకి 20 చొప్పున దోమలు కన్పిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం తొలిదశలో ఉందని అన్నారు. దోమలు మొక్కలోకి రసం పీల్చడం వలన పైరు లేత పసుపు రంగులో మారుతుందని అన్నారు. తొలి దశలో దుబ్బుకి 20–25 దోమలు ఉన్నట్లు గుర్తించినపుడే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బుప్రోఫెజిన్ 1.6ఎంఎల్ లేదా పైమెట్రోజైన్ 0.6గ్రాములు లేదా ట్రైఫ్లూమీజోపైరిమ్ 0.48ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్. సుభాని, యడవల్లి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.



నకరికల్లులో వరిపొలాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

అమ్మో.. వానరం!



పిడుగురాళ్ల: పట్టణంలోని కుమ్మరిపాలెంలో కోతుల బెడద ఎక్కువైంది. గురువారం రాత్రి సమయంలో నారాయణ స్కూల్ సమీపంలోని గృహాలపై సుమారు 100పైగా వానరాలు ఒక్కసారిగా గుంపులుగా రావటంతో మహిళలు చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారు. కోతులు ఎక్కువ సంఖ్యలో గృహాలలోని వస్తువులు, తినుబండరాలు పట్టుకొని వెళ్లాయి. కొంత మంది యువకులు కోతులను తరిమారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. కోతుల బెడదను తగ్గించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దూరవిద్య పోస్టర్లు ఆవిష్కరణ



క్రోసూరు: క్రోసూరు విద్యావనరుల కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) అడ్మిషన్ల గురించి వివరించే పోస్టర్లను ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దూరవిద్యా విధానం ద్వారా పదవతరగతి, ఇంటర్‌మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. పదవ తరగతికి బడిమధ్యలో మానేసిన వారు, పదవ తరగతి ఫెయిల్ అయి 14 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. మహిళలకు, పలు వృత్తి, వ్యాపార రంగాలలో ఉన్నవారికి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుబడిన వారికి సువర్ణ అవకాశం అన్నారు. ఇంటర్‌మీడియట్‌కు 15 సంవత్సరాలు నిండి ఉండి, పదవతరగతి పాసైన వారు అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ప్రభాకరరావు, ఏఈ సెంటర్ కో ఆర్డినేటర్ చిల్కా సురేష్ బాబు, క్రోసూరు మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వడియరాజులకు అండగా ఉంటాం

● రూ.30 లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తాం ● ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు, పక్కన ఎమ్మెల్సీ ఏసురత్నం



ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నంను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దాచేపల్లి : వడియరాజులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురంలో నిర్మించనున్న అభయ ఆంజనేయస్వామి దేవాలయానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో కలిసి ఎమ్మెల్యే కాసు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి లేక వడియరాజులు బెంగళూరు,హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వడియరాజులకు ప్రత్యేకంగా క్వారీ కేటాయించి లీజు ఇప్పించామని చెప్పారు. వడియరాజుల జీవన స్థితిగతుల్లో మార్పులు వచ్చాయని, చేతినిండా ఉపాధి ఉండటం వలన పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో వడియరాజుల్లో ఒక్కరిని కూడా శాసనసభ, శాసన మండలికి పంపించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వడియరాజులకు చట్టసభల్లోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించారని తెలియజేశారు. రూ.30 లక్షలతో వడియరాజుల కోసం కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొంతమంది దురాగతల వలన వడియరాజులకు ఉపాధి లేకుండా పోయిందని, ప్రస్తుత వడియరాజులు ఉపాధి కోసం వలస వెళ్లకుండా శాశ్వతంగా పని కల్పించారన్నారు. పల్నాడు అభివృద్ధిలో కాసు కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉందని, వడియరాజుల అభివృద్ధి కోసం ఆయన మరిన్ని పనులు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నంను కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు, సభ్యులు ఓర్సు శ్రీనివాసరావు, బత్తుల బయ్యన్న, పల్లపు హనుమంతరావు, పొగుల శ్రీను, ఉప్పు కాశయ్య, శివరాత్రి శివ, ఓర్సు దుర్గారావు, ఓర్సు వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీను, ఓర్సు కొండ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడిన దోషులకు చట్టపరంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో టీడీపీ నేతల దాడిలో గాయపడిన కార్యకర్తలు ఆకూరి వీరారెడ్డి, ఆకూరి సుధాకర్‌రెడ్డి, వేముల గురవారెడ్డి, అరుణను మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాసు గురువారం పరామర్శించారు. టీడీపీ నేతల ఆగడాలు గ్రామంలో హెచ్చుమీరుతున్నాయని, కావాలనే గొడవలు పెట్టుకుని కళ్లల్లో కారం చల్లి రాళ్లు, కర్రలు, మరణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారని బాధితులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కాసుకు చెప్పారు. గ్రామంలో అభివృద్ధి కోసం తాము కష్టపడుతున్నామని, టీడీపీ వాళ్లు మాత్రం అభివృద్ధిని అడ్డుకుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, టీడీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెడతామని, ఎన్నికల ముందు టీడీపీ నేతలు చేసే చిల్లర రాజకీయాలకు భయపడవద్దని, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాసు భరోసా ఇచ్చారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో టీడీపీ ఘర్షణలు సృష్టిస్తుందని, ఎన్నికల్లో టీడీపీ గెలవలేదనే అక్కసుతో ఇటువంటి నీచ సంస్కృతికి దిగజారుతున్నారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కాసు వెంట మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి సైదారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, జోనల్ కమిటీ ఇన్‌చార్జి మాశెట్టి బుజ్జి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు వేముల గురవారెడ్డి, పరిమి బాబు తదితరులున్నారు.



గాయపడిన ఆకూరి వీరారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాసు, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ

సమష్టి కృషితో సంక్షేమ పథకాలందిద్దాం

మాచర్ల రూరల్: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో కార్పొరేట్ వైద్యాన్ని, సూపర్‌స్పెషాలిటీ వైద్యులను సైతం గ్రామానికి తీసుకొచ్చి ఆరోగ్య భరోసా కల్పిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులంతా సమష్టిగా పనిచేసి విజయవంతం చేయటం అభినందనీయమని ఎంపీపీ బూడిద మంగమ్మ కొనియాడారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం జగనన్న ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని ఇదే విధంగా ప్రజలకు అందిస్తూ విజయవంతం చేయాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అంచనాలు, పనితీరును, బడ్జెట్, తాగునీరు, గృహ నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో గౌరవ సభ్యులు సమస్యలపై చర్చించినపుడు అధికారులు స్పందించి వాటిని వెంటనే పూర్తి చేయాలని, ముఖ్యంగా స్థానిక ప్రజా ప్రతినిధులకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓ సరోజనిదేవి, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రంగానాయక్, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వెంకట్రామయ్య, మాద్యానాయక్, ఫ్రాంక్లిన్, రంగయ్య, ఎంఈఓ అల్లి సురేష్, వైద్యులు శివలీల, ఎస్‌వీ, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు న్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బూడిద మంగమ్మ

ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో టీడీపీ చిచ్చు

వెల్దుర్తి: ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో తెలుగు దేశం పార్టీ నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు చిచ్చు పెట్టి ఘర్షణలకు తెరలేపుతున్నారు. మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తుంటే టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు ఆగస్టు 29న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి నలుగురు కార్యకర్తలను తీవ్రంగా గాయపరిచారు. గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామం మొత్తం వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. ఇది ఓర్చుకోలేని టీడీపీ పల్లెలో ఏదో జరుగుతుందని వైఎస్సార్ సీపీపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కూడా గ్రామంలోనే ఉండి పంటలు సాగు చేసుకుంటున్నప్పటికీ అనవసర దుష్ప్రచారం చేస్తున్నారు. గ్రామం ప్రశాంతంగా ఉండేందుకు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెటింగ్ పెట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.



గొట్టిపాళ్ళ గ్రామం

పోలీసుల విధుల పట్ల విద్యార్థులకు అవగాహన

దుర్గి: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో దుర్గి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులకు పోలీసు విధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ ఎం.శివ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసు స్టేషన్ సందర్శించారు. వారికి ఎస్ఐ శివ పోలీస్ విధులను రికార్డులను కమ్యూనికేషన్ సిస్టంతో చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసు వ్యవస్థ అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. పోలీసుల విధి నిర్వహణపై విద్యార్థులు ఆసక్తిగా పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

రెంటచింతల: పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్ వివిధ పాఠశాలల విద్యార్థులకు శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించి మాట్లాడారు. నేర నియంత్రణ, నేర దర్యాప్తులో పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాల పనితీరును, వాటి వినియోగం గురించి వివరించారు. విద్యార్థులు ఇటువంటి అవగాహన(ప్రేరణ)పొందటం ద్వారా పోలీసు, రక్షణ శాఖలలో సేవలు అందించడానికి ముందుకు వస్తారన్నారు. లాకప్, కేసు నమోదు చేయడం వంటి అంశాలను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివ



విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై వివరిస్తున్న ఎస్ఐ సామెల్